క్లుప్తంగా

కేంద్ర మంత్రి 'బండి'ని కలిసిన అయ్యప్పస్వాములు


కేంద్రమంత్రి సంజయ్‌తో మాట్లాడుతున్న అయ్యప్పస్వాములు

జమ్మికుంట: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ని జమ్మికుంట అయ్యప్పస్వాములు మంగళవారం కరీంనగర్‌లో కలిశారు. తాము జనవరి 5, 9వ తేదీల్లో శబరిమల వెళ్లేందుకు మూడు నెల క్రితం కోర్బా ఎక్స్‌ప్రెస్ రైలు టికెట్లు బుక్ చేసుకున్నట్లు తెలిపారు. రైల్వే శాఖ సదరు రైలును రద్దు చేసిందన్నారు. స్పందించిన రైల్వే అధికారులతో మాట్లాడి, స్వాములకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఐఏఎస్ అధికారి వంశీకి సూచించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశం, గురుస్వాములు నాగరాజు, సుధాకర్, మణికంఠ, రాజశేఖర్, గోపి, నిఖిల్, మల్లేశ్ తదితరులున్నారు. ,

'పుష్ప' హీరో, హీరోయిన్‌లపై ఎంవీఏ కేసు పెట్టాలి

హుజూరాబాద్: పుష్ప–2 సినిమా హీరో అల్లు అర్జున్, హీరోయిన్ రష్మిక మందన్నాలపై సెక్షన్ 177 మోటార్ వెహికిల్ యాక్ట్(ఎంవీఏ)–1988 కేసు పెట్టాలని హుజూరాబాద్ పట్టణానికి చెందిన సేవ్ ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ సంస్థ చైర్మన్, న్యాయవాది రమేశ్ కోరారు. మంగళవారం చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంధ్య థియేటర్ వద్ద అనుమతి లేకుండా అల్లు అర్జున్ ర్యాలీ తీశారని, ఆయన వెంట రష్మిక మందన్నా ఉన్నట్లు పేర్కొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా ఐలయ్య



హుజూరాబాద్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం హుజూరాబాద్ మండల అధ్యక్షుడిగా పెద్దపాపయ్యపల్లికి చెందిన మాదం ఐలయ్యను నియమించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నియామకపత్రం అందించారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక



రామడుగు: రంగసాయిపల్లి 100, 101వ బూత్ కమిటీలకు బీజేపీ నూతన అధ్యక్షులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణాధికారి కట్ట రవీందర్ తెలిపారు. 100వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా లింగంపల్లి శ్రీనివాస్, 101వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా మండల శేఖర్‌ను ఎన్నికయ్యారన్నారు.

ఆలయంలో పూజలు

రామడుగు: గోపాల్‌రావుపేటలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో మంగళవారం విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని వేదపండితులు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

మానసాదేవికి అభిషేకం

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీ మానసాదేవి ఆలయంలో అమ్మవారికి మంగళవారం పసుపుతో హరిద్ర అభిషేకం అర్చకుడు అమర్నాథ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రైతుపై కత్తితో దాడి


గాయపడిన వెంకటరాజిరెడ్డి

వీణవంక: హిమ్మత్‌నగర్‌కు చెందిన మారం వెంకటరాజిరెడ్డి అనే రైతుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వెంకటరాజిరెడ్డి మంగళవారం ఉదయం తన మొక్కజొన్న చేను వద్దకు వెళ్లాడు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి, కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో అతని ఎడమ చేతి నాలుగు వేళ్లు పూర్తిగా కట్ అయ్యాయి. కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారును ఢీకొన్న లారీ



తిమ్మాపూర్: కారును లారీ ఢీకొన్న ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వివరాల ప్రకారం.. మంగళవారం హైదరాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారును వెనక నుంచి వేగంగా వస్తున్న లారీ అలుగునూర్ చౌరస్తా సమీపంలో ఢీకొట్టింది. కారులోని ఇద్దరు మహిళలు, చిన్న బాబు, మరో ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

కేజీబీవీ టీచర్లు విధుల్లో చేరాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- చిగురుమామిడి కేజీబీవీ తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్

చిగురుమామిడి: రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న కేజీబీవీ టీచర్లు తక్షణమే విధుల్లో చేరాలని, మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్నందున విధుల్లో ఉన్నవారు అన్ని తరగతులు జరిగేలా చూడాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులతో, ఉన్నత విద్యాశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. దశలవారీగా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని, నాణ్యమైన ఆహారం అందుతుందా అని తెలుసుకున్నారు. మధ్యాహ్నం వండిన వంటలను పరిశీలించారు. అన్నం మెత్తగా అవుతోందని విద్యార్థినులు చెప్పడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన రైస్ వినియోగించాలని ఆదేశించారు. స్కూల్ గ్రౌండ్‌లో మునగ, జామ, నిమ్మ, కరివేపాకు తదితర మొక్కలు నాటాలని సూచించారు. అంతకుముందు ఇందుర్తిలో ఇటీవలే మృతిచెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బుర్ర శివలీల కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి వెంట సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హౌస్ ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో మధుసూదన్, ఎంఈవో పావని, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయకులు షాబుద్దీన్, ఎనగందుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చివరి మడి వరకూ నీరందిస్తాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


పంప్‌హౌస్ వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: చొప్పదండి నియోజకవర్గంలోని రైతులెవరూ సాగునీటి కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి మడి వరకూ నీరందిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించే పంప్‌హౌస్‌ను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. ఈ రిజర్వాయర్ నియోజకవర్గానికి వరప్రదాయినిగా నిలుస్తుందన్నారు. త్వరలోనే నారాయణపూర్ చెరువును నీటితో నింపి, యాసంగి పంటకు నీరిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలని కోరుతూ గంగాధర మండలంలోని పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌గుప్తా, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, నాయకులు మనోహర్, రామిడి రాజిరెడ్డి, కోల ప్రభాకర్, రోమాల రమేశ్, పడాల రాజన్న, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, చందు, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

జమ్మికుంట: ఓ మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి, ఆమెకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అబాది జమ్మికుంటలోని ఓ మిల్లులో పని చేస్తున్న మహారాష్ట్రకు చెందిన లక్ష్మి మంగళవారం కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో తన ఫోన్ పోగొట్టుకుంది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. లొకేషన్ ఆధారంగా గుర్తించి, బాధితురాలికి అప్పగించారు. ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

మానకొండూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డు పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

మానకొండూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సీపీ అభిషేక్ మహంతి మంగళవారం తనిఖీ చేశారు. పలు నేరాల్లో పట్టుబడిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు పక్కాగా ఉండాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామానికో పోలీస్ అధికారిని కేటాయించాలని సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన పోలీసులు అన్ని రకాల విధుల గురించి తెలుసుకోవాలన్నారు. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబీ, సీఐ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ దూరం'


మాట్లాడుతున్న హరీశ్

రామడుగు: మండలంలోని షానగర్ చౌరస్తా వద్ద ఈ నెల 26న నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కాంగ్రెస్ దూరంగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చొప్పదండి నుంచి దళిత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఉండగా, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో విగ్రహావిష్కరణ చేయించాలని నిర్వాహకులు నిర్ణయించడం దురదృష్టకరమన్నారు. నాయకులు నర్సింగ్‌బాబు, హన్మంతు, వీరయ్య, శ్రీను, అజయ్, సత్యం, కాంతయ్య పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు ఎంపిక



హుజూరాబాద్: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు హుజురాబాద్ పట్టణ శివారు కేసీ క్యాంపు ఎంజేపీ విద్యార్థిని జి.అంజలి ఎంపికైందని ప్రిన్సిపాల్ రాగమణి తెలిపారు. గత నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో అండర్–17 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిందని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు పాట్నాలో జరగనున్న 68వ జాతీయ స్థాయిల్లో ఆమె పాల్గొంటుందన్నారు. మంగళవారం అంజలిని అభినందించారు. పీఈటీ కవిత ఉన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి

హుజూరాబాద్: మనుషులందరూ ఒకరికొకరు గౌరవించుకునే సమాజం కోసం పని చేయాలని పెరియార్ ఈవీ రామస్వామి సూచనలను పాటించాలని మానవ వికాస వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంటాల బుచ్చయ్య కోరారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని హ్యూమనిస్ట్ హౌస్ విజ్ఞాన వికాస కేంద్రంలో రామస్వామి 51 వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు భోగం రమేశ్, బొల్లారం చంద్రమౌళి, మిత్ర సంఘాల ప్రతినిధులు కలకోటి వెంకటేశ్, కొంకటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తా వద్ద..

హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పెరియార్ రామస్వామి వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే కమిటీ మాజీ చైర్మన్ సందెల వెంకన్న ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, కేసీ.నరసింహారెడ్డి, కౌన్సిలర్ ముక్క రమేశ్, సొల్లు శంకర్, కట్కూరి రాజేందర్, ఆడెపు శ్రీనివాస్ తదితరులున్నారు.

రేపటి ధర్నా విజయవంతం చేయాలి

హుజూరాబాద్: కేజీబీవీ, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు గుంటి ఎల్లయ్య కోరారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. కేజీబీవీ, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ధర్నాకు ఉపాధ్యాయులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సైదాపూర్, శంకరపట్నం మండలాల బాధ్యులు జి.చంద్రమౌళి, బి.శ్రీధర్, కె.తిరుపతి, పి.సంజీవయ్య, ఈ.సంపత్ కుమార్ తదితరులున్నారు.

టీచర్లు తరలిరావాలి

జమ్మికుంట: కేజీబీవీ, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు మద్దతుగా హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ వద్ద ఈ నెల 26న టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాకు టీచర్లు తరలిరావాలని ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి అవినాశ్ కోరారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీటీఎఫ్ కార్యదర్శి కొడిగూటి తిరుపతి, కొండపాక తిరుపతి, బాబయ్య, ప్రభాకర్, ఎల్లయ్య తదితరులున్నారు.

ఆలయానికి ఏసీ వితరణ


ఏసీ అందిస్తున్న రమేశ్

తిమ్మాపూర్: నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేశ్ రూ.50 వేల విలువైన ఏసీని మంగళవారం అందించారు. ఆలయ కమిటీ చెర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్ లక్ష్మీరాజం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కనకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మారుతీనగర్‌లో క్రిస్మస్‌ను పురస్కరించుకొని నందిని డ్రెస్సెస్ సహకారంతో అంబాల ప్రభాకర్–లత దంపతులు మంగళవారం పేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు..

సైదాపూర్: సోమారం ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ హాస్టల్ విదార్థులకు స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ బండి కుమార్ సోమవారం రాత్రి దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమై, మంచి మార్కులు సాధించి, పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్లో రగ్గులు..

చిగురుమామిడి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు చిట్టెల మహేశ్–ఆస్మా దంపతులు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. వార్డెన్ మహేందర్‌రెడ్డి, పాస్టర్ పాల్ పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ ఇళ్ల సర్వే

శంకరపట్నం: మండలంలో ఈ నెల 25, 26న(సెలవు రోజుల్లోనూ) ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. అర్జీదారులు సర్వే బృందానికి ఆధార్‌కార్డు, ఇంటి స్థల పత్రాలు, పన్ను చెల్లింపు రశీదులు ఇవ్వాలన్నారు.

క్రిస్మస్ పండుగ వెలుగులు నింపాలి



రామడుగులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హుజూరాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక తదితరులు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- పలు గ్రామాల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

రామడుగు: మండల కేంద్రంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. క్రిస్మస్ పండుగ ప్రతీ ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్, ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, నాయకులు పూరెల్ల రాజగోపాల్ గౌడ్, అమిరిశెట్టి సుధాకర్, కోల రమేశ్, తడగొండ నర్సింగ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ పాఠశాలలో..

రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ జీనియస్ స్కూల్లో..

హుజూరాబాద్: పండుగల ద్వారా సంతోషం వెల్లివిరుస్తుందని, ఏసుక్రీస్తు శాంతికి చిహ్నమని, ఆయన చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్లో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరై, మాట్లాడారు. విద్యార్థులు ఏసుక్రీస్తుపై గేయాలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులున్నారు.

ఏకశిల పాఠశాలలో..

హుజూరాబాద్ మండలంలోని తుమ్మనపల్లి శివారు ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ దినేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరేశ్, స్టాఫ్ ఇన్‌చార్జి శరత్‌బాబు, ఉపాధ్యాయులున్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు..

హుజూరాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ.. గత సీఎం కేసీఆర్ అన్ని మతాలను సమాన దృష్టితో చూసేవారని, కొత్త ప్రభుత్వం కూడా ఆ పద్ధతిని అనుసరించడం సంతోషకరమన్నారు. క్రైస్తవులకు కానుకలు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పాస్టర్లు ఏసుక్రీస్తు బోధనలను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, పాస్టర్ నవీన్, ఆర్ఐ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీసీపీఎస్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి జాషువా ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. జమ్మికుంట, వీణవంక తహసీల్దార్లు రమేశ్, శ్రీనివాస్ కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. క్రీస్తు సందేశకులు రాంబాబు, జమ్మికుంట, వీణ వంక మండలాల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, కేవై.స్టీఫెన్ రాజు, అశోక్, సత్యరాజు, సిమోనుబాబు, ఆనందం తదితరులు పాల్గొన్నారు. లోటస్ పాండ్ పాఠశాలలో కరస్పాండెంట్ సంపత్‌రావు ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ జరిపారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

శ్మశానం నీళ్లు.. చిమ్మ చీకట్లు

- 'భగీరథ' పైప్‌లైన్, డ్రైనేజీలు, వీధిలైట్లు లేక ప్రజల ఇక్కట్లు
- తాగునీటికి గోసపడుతున్న జమ్మికుంట బీడి కార్మికుల ఏరియావాసులు
- మిల్లుల డస్ట్‌తో అనారోగ్య సమస్యలు
- ఏళ్లు గడుస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన



'ఈమె పేరు హమాలి లత. జమ్మికుంట మున్సిపల్ పరిధి నాలుగో వార్డు కొత్తపల్లిలోని బీడి కార్మికల ఏరియాలో నివాసం ఉంటోంది. సమీపంలోని శ్మశాన వాటిక బోరుకు అనధికారికంగా పైపు బిగించుకొని, తాగునీటిగా వాడుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తోంది. 100 మీటర్లకు పైగా దూరంలో ఉన్న కరెంట్ స్తంభాల నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నామంటోంది. రోడ్డు వెంట వీధి లైట్లు లేక చిమ్మ చీకట్లలో భయపడుతూ బతుకుతున్నామని వాపోతోంది. ఇది తమ ఒక్కరి కుటుంబ పరిస్థితే కాదని, సుమారు 70 కుటుంబాల దుస్థితని అంటోంది. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తోంది.'


కాలనీవాసులు నీటి కోసం శ్మశానవాటిక నుంచి వేసుకున్న పైపు


పని చేయని బోరు చుట్టూ మురికినీరు

జమ్మికుంట: ఏళ్లు గడుస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే.. తాగునీరు మొదలు డ్రైనేజీ, విద్యుత్ వంటి సౌకర్యాలు లేక జమ్మికుంట మున్సిపల్ పరిధి నాలుగో వార్డు కొత్తపల్లిలోని బీడీ కార్మికుల ఏరియావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో విలీనమైనా తమ బతుకు మారలేదని వాపోతున్నారు. ఎన్నిసార్లు పాలకులు, అధికారులు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ బాధలు పట్టించుకోవాలని వేడుకుంటున్నారు.

కాలనీలో సమస్యలు ఇవీ..

బీడి కార్మికల ఏరియాలో మిషన్ భగీరథ నల్లాలు లేవు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేదు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయలేదు. వర్షాలకు మురికి నీరు ఇళ్లలోకి చేరుతోంది. జనావాసాల మధ్యే మిల్లులు నిర్వహణతో డస్ట్ ఇళ్లను కమ్మేస్తోంది. శానిటేషన్ లేకపోవడంతో దోమలు విజృంభించి, రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

హామీలు అమలు చేయాలి..

ఎన్నికల సమయంలో బీడి కార్మికుల ఏరియాలో మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలపై నాయకులు అనేక హామీలు ఇచ్చారని ఇక్కడి ప్రజలు అంటున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, రోడ్లు, డ్రైనేజీ, మిషన్ భగరథ నీరు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటివి తక్షణమే అమలు చేయడంతోపాటు మిల్లుల డస్ట్ రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జమ్మికుంట మున్సిపాలిటీలో ప్రజల సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే పరిశీలిస్తాం. నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. నిధులు విడుదలవగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.
– ఎండీ.అయాజ్, మున్సిపల్ కమిషనర్, జమ్మికుంట

హనుమాన్ ఆలయ నూతన కమిటీ


శంకర్


పున్నంచందర్

హుజూరాబాద్: స్థానిక హనుమాన్ దేవాలయ నూతన కమిటీని మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రకటించింది. చైర్మన్‌గా కొలిపాక శంకర్, వైస్ చైర్మన్‌గా బొల్లు పున్నంచందర్ నియమితులయ్యారు. అలాగే, డైరెక్టర్లుగా ప్రతాప నాగరాజు, బుసారపు శంకర్, మాచర్ల నరేశ్, ఎర్ర మధులత, గాలీబు రాజేందర్‌లను నియమించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ బాధ్యుడు వొడితెల ప్రణవ్‌లకు నూతన కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.